క్లుప్తంగా

కలెక్టర్‌కు శుభాకాంక్షలు



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కలెక్టర్ విజయేందిరకు అదనపు శివేంద్ర ప్రతాప్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసిన ఆయన కలెక్టర్‌కు పూల మొక్క అందజేశారు.

ఎస్పీకి..

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు తీసుకున్న డి.జానకిని గురువారం జైలు సూపరింటెండెంట్ వెంకటేశం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమేరకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీలు, ఇతర అంశాలపై చర్చించారు.

రేపు విద్యుత్ అంతరాయం

జడ్చర్ల టౌన్: పోలేపల్లి సెజ్‌లో ఉన్న 132కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ శ్రీనివాసులు తెలిపారు. పోలేపల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని అన్ని పరిశ్రమలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అదేవిధంగా కావేరమ్మపేట, పోలేపల్లి, గంగాపురం, కొండేడ్, కోడ్గల్ 33కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలోనూ విద్యుత్ సరఫరా ఉండదని గమనించాలని కోరారు.

'నీట్' మళ్లీ నిర్వహించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని.. పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న మార్చ్ నిర్వహిస్తున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. 24 లక్షల మంది విద్యార్థులు రాసిన పరీక్షపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, దీన్ని నిరసిస్తూ మార్చ్‌కు పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరుకావాలని కోరారు. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు సహకరించాలని పేర్కొన్నారు. నాయకులు భరత్, ప్రశాంత్, నందు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఘనసన్మానం

జడ్చర్ల టౌన్: జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో మండలంలోని గుట్టకాడితండాకు చెందిన జరుపుల రాకేష్ ప్రతిభచాటారు. రాకేష్ తమ పూర్వవిద్యార్థి కావటంతో గురువారం పెద్ద ఆదిరాల జెడ్పీహైస్కూల్‌లో ఉపాధ్యాయబృందం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నర్సింహులు, ఉపాధ్యాయులు మధు, నార్యానాయక్, లక్ష్మి, తాహెర్, శ్యాంసుందర్, సంధ్య, శ్రీదేవి, రఘు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం, దుప్పట్ల పంపిణీ



జడ్చర్ల టౌన్: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగస్తుల యూనియన్ వ్యవస్థాపకుడు కామ్రేడ్ థారక్‌నాథ్ వర్ధంతి పురస్కరించుకుని గురువారం పట్టణంలోని సత్యేశ్వర ఆశ్రమంలో జడ్చర్ల క్లస్టర్ ఎస్‌బీఐ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం, స్వీట్లు పంపిణీ చేసి దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో పట్టణంలోని 4 బ్రాంచ్‌లతోపాటు కేశంపేట, ఆమనగల్, ఉడిత్యాల్, కందూర్, మిడ్జిల్, వెల్జాల ఉద్యోగులు పాల్గొన్నారు.

కేంద్రంపై మల్లురవి వ్యాఖ్యలు సరికావు

జడ్చర్ల టౌన్: కేంద్ర ప్రభుత్వంపై నాగర్‌కర్నూలు ఎంపీ మల్లురవి చేసిన వ్యాఖ్యలు తగవని బీజేపీ అధికార ప్రతినిధి ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్ అన్నారు. గురువారం జడ్చర్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వానికి సరైన మెజార్టీ లేదని వ్యాఖ్యానించడం సరికాదన్నారు. నాయకులు ఆర్.శ్రీనివాస్‌గౌడ్, కృష్ణ, గౌరి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని 37వ వార్డు సద్దల్‌గుండుకు చెందిన ఫర్హానాబేగం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. కాగా ఆమెకు రూ.1.30 లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. సదరు ఎల్‌ఓసీని గురువారం ఆమె భర్తకు స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, షేక్ హబీబ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వే

దేవరకద్ర: పట్టణంలో నల్లా కనెక్షన్‌ల సర్వే కొనసాగుతోంది. గురువారం గ్రామ పంచాయతీ సిబ్బందితో పాటు, అంగన్‌వాడీ కార్యకర్తలు పలు వార్డుల్లో తిరిగి సర్వే నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి నల్లా కనెక్షన్ పరిశీలించి వివరాలు సేకరించారు. కాగా సర్వే వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారని ఈఓ సీత్యానాయక్ తెలిపారు.



కొల్లూర్‌లో..



మిడ్జిల్‌లో..

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

సాక్షినెట్‌వర్క్: ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని గురువారం చిన్నచింతకుంట మండలం దమగ్నాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో.. విద్యార్థులకు స్వయంగా అల్బెండజోల్ మాత్రలు వేశారు. అదేవిధంగా దుస్తులు, నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అప్పంపల్లి సింగిల్ విండో డైరెక్టర్ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దమగ్నపురంలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

- ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి అడ్డాకుల మండలకేంద్రంలోని పాఠశాలలో గురువారం చిన్న పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. అదేవిధంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో కార్యక్రమం కొనసాగింది.
- భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ బస్వరాజ్ గౌడ్ చిన్నారులకు మాత్రలు వేశారు.
- గండేడ్ పరిధిలోని గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్, క్లస్టర్ డాక్టర్లు హరీష్, సునీల్, అనిత, సీహెచ్‌ఓ రాములు తదితరులు పాల్గొన్నారు.
- నవాబుపేట పరిధిలో వైద్యబృందం సూపర్ వైజర్ శ్రీనివాస్, హెచ్‌ఎం రాంచంద్రయ్య, పుష్పలత, హరిక, సరిత, రాములు పాల్గొన్నారు.
- జడ్చర్ల పరిధిలో మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు. బాదేపల్లి జెడ్పీహైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పాల్గొన్నారు.
- దేవరకద్ర, కొత్తకోట మండలాల పరిధిలోని అన్ని గ్రామాల్లో కార్యక్రమం చేపట్టారు. వైద్యురాలు రాధిక, హెచ్‌ఎం పద్మ, మార్కెట్ మాజీచైర్మన్ అరవింద్‌రెడ్డి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.
- మిడ్జిల్ పరిధిలో ఎంపీపీ సుదర్శన్, ఎంపీటీసీలు గౌస్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.
- రాజాపూర్ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్‌రావ్, తదితరులు పాల్గొన్నారు. కేజీబీవీలో విద్యార్థులకు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్వయంగా మాత్రలు వేశారు.



పేరూర్‌లో..



అడ్డాకులలో ..



భూత్పూర్‌లో..



గండేడ్‌లో..

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

నారాయణపేట రూరల్: ప్రైవేటు ఆస్పత్రి నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘిస్తే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వైద్య ఆరోగ్యశాఖ స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీమ్ జాయింట్ డైరెక్టర్ మోతీలాల్‌నాయక్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులను అకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రోగుల రిజిస్టర్, డాక్టర్ల అర్హత సర్టిఫికెట్లు, సర్వీసు చార్జీల పట్టిక, సమస్యలతో పాటు వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు ఆస్పత్రులలో సాధారణ కాన్పులను ప్రోత్సహించాలని, సిజరిన్ ఆపరేషన్‌ల సంఖ్య పెరగకుండా చూసుకోవాలన్నారు. డబ్బుల కోసం మోసపూరిత చర్యలకు పాల్పడరాదన్నారు. రికార్డుల నిర్వహణ సరిగ్గా ఉండాలని సూచించారు. ఆస్పత్రులలో నిర్వహించే సేవలను హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో తప్పకుండా నమోదు చేయాలన్నారు. ఆన్‌లైన్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీ ఆస్పత్రిలో తప్పకుండా అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం 2010 నియమ నిబంధనలు పాటించాలన్నారు. తనిఖీలో రాష్ట్ర బృందం సభ్యులు శ్రీనివాస్, కోటేశ్వర్‌రావు, విజయ్‌భాస్కర్, జిల్లా డీఎంహెచ్‌ఓ సౌభాగ్యలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శైలజ పాల్గొన్నారు.



నారాయణపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి ల్యాబ్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం

మల్లురవికి ఘనస్వాగతం

భూత్పూర్: పట్టణంలోని చౌరస్తాలో గురువారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డా. మల్లురవికి కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి సంజీవ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకట నర్సింహారెడ్డి, గోవర్ధన్ గౌడ్, విజయ్‌గౌడ్, బోరింగ్ నర్సింహులు, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు హర్యానాయక్, చెన్న కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల: తెలంగాణ విభజన హామీల అమలుకు కృషిచేస్తామని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి తెలిపారు.గురువారం ఆయన జడ్చర్లలో కొద్దిసేపు ఆగారు. ఈసందర్భంగా మాట్లాడారు. రాష్ట్రం ఏర్పాటు సమయంలో విభజన బిల్లులో పేర్కొన్న హామీల అమలుకు సంబంధించి పార్లమెంట్‌లో నినదిస్తామని అన్నారు. అదేవిధంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ప్రకటించాలని డిమాండ్ చేస్తామన్నారు. అనంతరం స్థానిక నాయకులు మల్లురవిని సన్మానించారు. కార్యక్రమంలో అశోక్‌యాదవ్, వెంకటేశం, ఖాజపాష తదితరులు పాల్గొన్నారు.



డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట రూరల్: పోలీస్ వాహనాలను నడిపించే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంటీఓ ఆర్‌ఎస్‌ఐ శివశంకర్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం పోలీసు వాహన డ్రైవర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ పెట్రోలింగ్ విధులు చేపట్టే పోలీసులు నిరంతరం కేటాయించిన ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తుండాలని, వాహనానికి జీపీఎస్ సిస్టం కనెక్ట్ చేయబడి ఉందని చెప్పారు. ముందస్తు నేరాల కట్టడికి ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు. కంప్యూటర్ ఆధారంగా వాహన రూట్‌లను చెక్ చేయడం జరుగుతుందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయన్నారు. వాహనాన్ని ప్రతిరోజు శుభ్రపర్చాలని, కండిషనల్‌లో ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు. కార్యక్రమంలో ఐటీకోర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్న శివశంకర్

విద్యార్థులకు చేయూత

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం గ్రామానికి చెందిన హెల్పింగ్ 100 యూత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం చేయూత నందించారు. బ్యాగులు, పుస్తకాలు, పెన్నులు, ప్యాడ్‌లు అందించారు. అదేవిధంగా ప్రస్తుత విద్యాసంవత్సరంలో పదో తరగతి విద్యార్థులకు కావాల్సిన స్టడీ మెటీరియల్ అందించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు సభ్యుడు సంతోష్ తెలిపారు. జీపీఏ 10 సాధించిన వారికి రూ.1లక్ష ఇస్తామని ప్రకటించారు. మండలంలోని కోల్‌బాయితండాకు చెందిన అంజలికి ఇంటర్ పూర్తిచేసేందుకు ప్రతినెలా రూ.2వేలు ఇచ్చేందుకు నాగసాల పాఠశాల ఉపాధ్యాయురాలు సావిత్రి ముందుకు వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనంతప్ప, ఉపాధ్యాయులు సుజాత, సత్యనారాయణ, కిరణ్‌కుమార్, తిరుపతి రెడ్డి, లక్ష్మణ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా నవచండీ మహాయాగం



నారాయణపేట రూరల్: ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీ పరిపూర్ణనందగిరి స్వామి ఆదేశాలతో సింగారం గిరిపీఠంపై గురువారం నవచండీ మహాయాగాన్ని ఘనంగా నిర్వహించారు. అంబాభవాని మందిరం నిర్వాహకులతో కలిసి శివానందస్వామి ఆధ్వర్యంలో యజ్ఞం, పూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టారు. లోకకల్యాణనార్థం నిర్వహిస్తున్న కార్యక్రమంలో గ్రామంలో పార్టీలకు అతీతంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

జోరందుకున్న పనులు

దేవరకద్ర: మండల కేంద్రంలో మొక్కలు నాటే పనులు జోరందుకున్నాయి. గురువారం గూరకొండ రహదారిలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి కార్యక్రమం నిర్వహించారు. రహదారికి రెండు వైపుల గుంతలు తీసి మొక్కలను నాటారు. ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో పెద్ద ఎత్తున పనులు చేపట్టారు.



ప్రభుత్వ పథకాల్లో భాగస్వామ్యం కల్పించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో దూప, దీప నైవేద్య అర్చకులను భాగస్వామ్యం చేయాలని.. జిల్లా సంఘం అధ్యక్షుడు జంగం మహేష్ అన్నారు. జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘం నూతన కార్యాలయాన్ని గురువారం గురుపాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మహేష్ మాట్లాడారు. దూప, దీప నైవేద్య అర్చకులకు గుర్తింపు కార్డులు, హెల్త్‌కార్డులు జారీ చేయాలని కోరారు. సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి గాండ్ల రవి మాట్లాడుతూ గత ఐదు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. నైవేద్య అర్చకుల పిల్లల చదువులకు, ఉపనయనాలకు ఆర్థికంగా చేయూత అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, వనపర్తి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీకాంతాచారి, నటరాజ్, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, జగదీశ్వర్, సత్యనారాయణాచారి తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అర్చకులు

ఆర్థికసాయం అందించాలని డిమాండ్



ధర్నా చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ, ఎస్టీ బాధితులకు, కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేస్తూ కేవీపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లెల మాణిక్యంరాజు మాట్లాడారు. 2022 సంవత్సరం నుంచి హత్యలు, దాడులు, అత్యాచారాలకు గురైన బాధితులకు నేటి వరకు ఆర్థికసాయం అందలేదన్నారు. చట్ట ప్రకారం ఎస్సీ, ఎస్టీ కేసు అయిన తర్వాత బాధిత కుటుంబానికి 45 రోజుల్లో ఆర్థికసాయం అందించాలని.. కానీ సంవత్సరాలు గడిచినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. జిల్లాలో దాదాపు 150 కేసులకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని, వీరందరికీ తక్షణమే ఆర్థికసాయం అందిచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కులాంతర వివాహం చేసుకున్న వారికి ప్రోత్సాహంగా రూ. 2.50 లక్షలు ఇవ్వాలని అన్నారు. జిల్లాలో కులాంతర వివాహాలు చేసుకుని ఆర్థికసాయం కోసం 50 మందికి పైగా ఎదురు చూస్తున్నారని వివరించారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు లక్ష్మీదేవి, జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాములు, బాలరాజు, నాయకులు శంకర్, ప్రసాద్, మొగులయ్య, వెంకటేష్, నరసింహా, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యవంతమైన జీవితం

మహబూబ్‌నగర్ క్రీడలు: నిరంతరం యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందుతారని సుప్రభాత్ హెల్త్‌క్లబ్ కన్వీనర్ జి.పాండురంగం అన్నారు. భారత్ వికాస్ పరిషత్, సుప్రభాత్ హెల్త్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో గురువారం అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాండురంగం యోగా ప్రాధాన్యత, ఉప యోగాల గురించి వివరించారు. కార్యక్రమంలో బుచ్చారెడ్డి, ఎస్.భూషణ్‌పాండే, రమేష్‌చందర్, వీఎస్ఆర్‌కే.ప్రసాద్, చంద్రుడు, రాంచందర్, శంకరయ్య, చంద్రశేఖర్, రాంరెడ్డి, వెంకటేశ్వర్లు, యాదయ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



యోగా సాధన చేస్తున్న సభ్యులు

'పుస్తకాలు విక్రయిస్తున్నా పట్టించుకోరా?'



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు విక్రయించడం చట్ట విరుద్ధమని.. అటువంటి బడులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఓ స్కూల్‌లో విద్యార్థులకు యాజమాన్యం పుస్తకాలు అమ్ముతుండగా పట్టుకున్నారు. ఈమేరకు నాయకులు డీఈఓ రవీందర్‌కు సమాచారం ఇచ్చారు. అనంతరం ఆయన ఎంఈఓ జయశ్రీని అక్కడికి పంపించారు. అయితే అక్కడికి వెళ్లిన ఆమె విద్యార్థి సంఘాల నాయకులతో మాట్లాడి వెళ్లిపోయారు. పుస్తకాల గదిని సీజ్ చేయడం గానీ, పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవడం గానీ చేయకపోవడంతో ఏబీవీపీ నాయకులు ఆగ్రహించారు. ఎవరి ఒత్తిడితో చర్యలు తీసుకోకుండా వెళ్లిపోయారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సతీష్, శివ, అరవింద్, అరుణ్, వరుణ్, కార్తిక్, గణేష్, వినోద్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రతి కార్యకర్త హిందూ సమాజ రక్షణ కోసం పనిచేయాలని వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ప్రతినిధులు అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలు శివాజీ మహారాజ్ పట్టాభిషేకం రోజును పురస్కరించుకొని హిందూ సామ్రాజ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బండమీదిపల్లి చౌరస్తాలోని శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ప్రతినిధులు మాట్లాడుతూ శివాజీ పట్టాభిషేకం రోజును హిందూ సామ్రాజ్య దినోత్సవంగా నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి నలిగేశి లక్ష్మీనారాయణ, విభాగ్ కార్యదర్శి అద్దని నరేందర్, హన్మంతు, రామకృష్ణశర్మ, సంపత్, బజరంగ్‌దళ్ జిల్లా సహ సంయోజక్ కుమార్, ఛత్రపతి, జయంతు, శివ, రాము, హరిప్రకాశ్‌గౌడ్ పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలు

వేతనాలు నిలిచిపోయాయి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: తెలంగాణ సమగ్ర శిక్ష అభియాన్‌లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న సిబ్బందిని వెంటనే రీ ఎంగేజ్ చేయాలని కలెక్టర్ విజయేందిరకు వినతిపత్రం అందజేశారు. ఏప్రిల్ 29న ఇచ్చిన ప్రొసీడింగ్ ఆధారంగా అదే రోజు నుంచి రీ ఎంగేజ్ కావాల్సి ఉందని.. కానీ చర్యలు తీసుకోకపోవడంతో వేతనాలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 450 మంది సిబ్బంది వేతనాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. వెంటనే ప్రక్రియ చేపట్టాలని కోరారు. ఐకాసా కోఆర్డినేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

అడ్డాకుల: మండల పరిధిలోని పెద్దమునుగల్‌ఛేడ్‌కి చెందిన అక్బర్ అనారోగ్యంతో మృతి చెందడంతో జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు గురువారం అక్బర్ మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. జెడ్పీటీసీ రూ.10వేలను పంపడంతో వాటిని బాధిత కుటుంబానికి అందజేశారు.



విద్యార్థులకు పుస్తకాల పంపిణీ




అమిస్తాపూర్‌లో పుస్తకాలు అందుకొంటున్న విద్యార్థులు



మిడ్జిల్ జూనియర్ కళాశాలలో పుస్తకాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ వెంకటయ్య తదితరులు

మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాలను ప్రిన్సిపాల్ వెంకటయ్య గురువారం అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నృగ్నేష్, చరణ్, కరుణ్‌జీ, శ్రీనివాస్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ సమీపంలో ఉన్నా జ్యోతిబా పూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో గురువారం జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్ పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. స్పెషల్ ఆఫీసర్ బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలో..

సాందీపని ఆశ్రమంలో..

స్టేషన్ మహబూబ్‌నగర్: ఎస్‌బీఐ యూనియన్ నేత వై.తారకనాథ్ వర్ధంతిని పురస్కరించుకొని.. ఎస్‌బీఐ అవార్డు స్టాఫ్ ఆధ్వర్యంలో గురువారం యూనియన్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బండమీదిపల్లిలోని సాందీపని ఆవాసంలో విద్యార్థులకు దాదాపు రూ.50వేల విలువగల పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, పెన్నులు, ప్యాడ్‌లు అందజేశారు. ఎస్‌బీఐ ఎస్‌యూహెచ్‌సీ ఏజీఎస్ వెంకటేశ్వర్లు, రీజినల్ కార్యదర్శి నరేష్‌గౌడ్‌తోపాటు లోకల్ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.